

పరిచయ కార్యక్రమంలో మాట్లాడుతున్న కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్, పక్కన బీఆర్ఎస్ పార్టీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి


నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

15 | హైదరాబాద్, శుక్రవారం 22 మార్చి 2024 | HYDERABAD


## టీ హబ్‌తో వెంచర్ బ్లిక్ ఒప్పందం

సిటీబ్యూరో, మార్చి 21(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ కేంద్రంగా పురుడు పోసుకున్న ఆవిష్కరణలకు అంతర్జాతీయ స్థాయిలో డిమాండ్ కల్పించేలా టీ హబ్, ప్రముఖ హెల్త్ కేర్ ఇన్నోవేషన్ సంస్థ వెంచర్ బ్లిక్ కలిసి పనిచేయనున్నది. టీ హబ్‌లో జరిగిన కార్యక్రమంలో వెంచర్ బ్లిక్ దక్షిణాసియా ఆపరేషన్స్ హెడ్ డాక్టర్ కైలాష్ జియాల్ దాసాని, వెంచర్‌బ్లిక్ వ్యవస్థాపకుడు సీఈవో క్రిస్ లీ, టీ హబ్ సీవోవో ఆంథోని అనీష్ సమక్షంలో ఒప్పందం చేసుకున్నారు. పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి జయేష్ రంజన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.



# ప్రజా సేవకుడు కావాల్నా.. హాయ్.. బాయ్ చెప్పి పోయేటోళ్లు కావాల్నా?

### బీఆర్ఎస్ ప్రజల పార్టీ.. కమలం, కాంగ్రెస్ స్వార్థ పార్టీలు

జాతీయ పార్టీల్లో ఒక్కరైనా.. సీఎంగా ఐదేండ్లు పాలించే నాయకుడున్నాడా..?

పదేండ్లలో పది రాష్ట్రాల ప్రభుత్వాలను కూల్చిన ఘనత బీజేపీది

వందరోజుల కాంగ్రెస్ పాలన అట్టర్ ఫ్లాప్

బీఆర్ఎస్ పార్టీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి పరిచయ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

దుండిగల్, మార్చి 21 : తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం నిబద్ధతతో పనిచేసే ఏకైక పార్టీ బీఆర్ఎస్ పార్టీ అని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ, గండిమైసమ్మలోని 'మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం' (జిల్లా తెలంగాణ భవన్)లో గురువారం బీఆర్ఎస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డితో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు, కార్యకర్తలతో పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్ కాంగ్రెస్, బీజేపీలపై నిప్పులు చెరిగారు. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీల్లో ఐదేళ్ళపాటు ముఖ్యమంత్రిగా పనిచేసే నాయకుడు ఒక్కడైనా ఉన్నాడా..? అని ప్రశ్నించాడు. గడిచిన పదేండ్ల కాలంలో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పది రాష్ట్రాల ప్రభుత్వాలను కూల్చివేయడం తప్ప ప్రజలకు చేసిందేమిటని ప్రశ్నించారు. తమ స్వార్థం కోసం బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు పనిచేస్తే బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ రాష్ట్ర ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి అమలు చేశారన్నారు. త్వరలో మల్కాజిగిరి ఎంపీ స్థానానికి జరుగనున్న త్రిముఖ పోరులో బీఆర్ఎస్‌దే విజయమని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ధీమా వ్యక్తం చేశారు. ఇందుకోసం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ప్రచార కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గత 20 ఏళ్ళ కాలంలో పలు బస్తీలు, కాలనీలల్లో 'మధుర ట్రస్ట్'పేరుతో ఉచిత వైద్య శిబిరాలతో పాటు అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారని, ప్రజలకు సేవ చేసే నాయకుడే రావాలని, ఎన్నికలప్పుడు హెలికాప్టర్లలో వచ్చి హాయ్.., బాయ్ చెప్పే నాయకులు అవసరం లేదన్నారు. స్థానికంగా మన నాయకుడు మనకు ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమన్నారు. కొడంగల్‌లో ఓడిపోయి మల్కాజిగిరిలో గెలిచిన రేవంత్‌రెడ్డి ప్రజలకు చేసిందేమిలేదన్నారు. హుజురాబాద్‌లో ఓడిన ఈటెల రాజేందర్ మల్కాజిగిరిలో గెలిచినా చేసేది ఏమీ లేదన్నారు. అంతకు ముందు రాగిడి లక్ష్మారెడ్డి కార్యకర్తలు, నేతలకు పరిచయం చేసుకున్నారు. తనను ఎంపీగా గెలిపిస్తే నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధికి బాటలు వేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ సన్నశ్రీశైలంయాదవ్, దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్, నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు శంభీపూర్‌కృష్ణ, నిజాంపేట్ కార్పొరేషన్ సీనియర్ బీఆర్ఎస్ నేత కొలన్ గోపాల్‌రెడ్డి, ఆయా కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు చెందిన కార్పొరేటర్లు, కౌన్సిలర్లు నాయకులు, కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిల్లకు చెందిన పలువురు కార్పొరేటర్లు, నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్‌తో కలిసి సూరారం కట్టమైసమ్మ ఆలయం, దుండిగల్‌లోని సింగాపురం మైసమ్మదేవాలయాల్లో పూజలు చేశారు.



హాజరైన నాయకులు, కార్యకర్తలు




# సీఆర్ఎంపీ అటకెక్కిందా?

### గ్రేటర్ స్ఫూర్తిగా ఢిల్లీ, ఇతర మెట్రో నగరాల్లో సీఆర్ఎంపీ విధానం అమలు

### గత ప్రభుత్వ హయాంలో విజయవంతంగా మొదటి దశ పూర్తి

### మూడునెలలైనా కొత్తప్రాజెక్టుల ఊసెత్తని కాంగ్రెస్ ప్రభుత్వం

### కొత్త సర్కారు ముందు రూ.696.71 కోట్లతో జీహెచ్ఎంసీ రెండో విడత ప్రతిపాదనలు

సిటీబ్యూరో, మార్చి 21 (నమస్తే తెలంగాణ) : కాంప్రహెన్సివ్ రోడ్ మెయింటనెన్స్ ప్రోగ్రామ్(సీఆర్ఎంపీ) పథకం కింద రెండో దశ పనులు చేపట్టాలన్న జీహెచ్ఎంసీ ప్రతిపాదన అటకెక్కింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు దాటినా కొత్త ప్రాజెక్టుల ఊసే ఎత్తడం లేదు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వానికి సీఆర్ఎంపీ రెండో దశలో రూ.696.71 కోట్లతో పనులు చేపట్టేందుకు అనుమతి ఇవ్వాలని జీహెచ్ఎంసీ కోరినప్పటికీ సర్కారు నుంచి ఎలాంటి పరిపాలన అనుమతులు లభించలేదు. దీంతో ఇంజినీరింగ్ విభాగం అధికారులు, కమిషనర్ సైతం సీఆర్ఎంపీ రెండో దశపై సమీక్ష జరపడం లేదు. ఫలితంగా ఇప్పట్లో రెండో దశ పనులు ప్రారంభం కావడం కష్టసాధ్యంగానే మారింది. కాగా గత కేసీఆర్ ప్రభుత్వ హయంలో గుంతలు లేని రహదారులే లక్ష్యంగా వాహనదారులకు మెరుగైన ప్రయాణ సౌకర్యం కల్పిస్తూ ప్రధాన రహదారుల నిర్వహణలో భాగంగా 525 విభాగాలుగా విభజించి తొలి విడతగా 811.958 కిలోమీటర్ల రహదారిని ప్రైవేట్ ఏజెన్సీలకు 2020 సంవత్సరంలో అప్పగించారు. దాదాపు రూ.1050కోట్ల మేర ఖర్చు చేసి నిర్ణీత లక్ష్యాన్ని గతేడాది అక్టోబరులోనే చేరుకున్నారు. ఈ సీఆర్ఎంపీ విధానం ఇతర మెట్రో నగరాలకు ఆదర్శంగా నిలిచింది. ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు ఇప్పటికే సీఆర్ఎంపీ మోడల్ వివరాలను తీసుకోగా.. ఛత్తీస్‌గఢ్ , రాజస్థాన్‌కు చెందిన పలు కార్పొరేషన్లు పురపాలక శాఖను సంప్రదించారు. ఇటువంటి పథకాన్ని కొత్త ప్రభుత్వం చేపట్టేందుకు ముందుకు రాకపోవడం పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి.

**రూ. 696.71కోట్లతో సీఆర్ఎంపీ రెండో దశ ప్రతిపాదనలు**

| జోన్ | ప్రాంతాలు (రహదారులు) | పొడవు (కిలోమీటర్లు) | అంచనా వ్యయం రూ.కోట్లలో |
|---|---|---|---|
| ఎల్బీనగర్ | 82 | 90.53 | 152.98 |
| చార్మినార్ | 90 | 67.68 | 107.64 |
| ఖైరతాబాద్ | 92 | 64.45 | 98.96 |
| శేరిలింగంపల్లి | 89 | 94.785 | 165.65 |
| కూకట్‌పల్లి | 50 | 75.497 | 120.66 |
| సికింద్రాబాద్ | 42 | 29.488 | 50.82 |
| | 445 | 422.43 | 696.71 |

### మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో

# అదనంగా 29 పోలింగ్ కేంద్రాలు

మేడ్చల్, మార్చి 21 (నమస్తే తెలంగాణ) : మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో పోలింగ్ కేంద్రాల సంఖ్య పెరిగింది. 1500 అర్బన్ ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలలో 1600 ఓటర్లు మించకుండా ఉండేలా పోలింగ్ కేంద్రాల సంఖ్యను పెంచినట్లు అధికారులు తెలిపారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఎల్బీనగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాలు ఉన్నాయి. ప్రసుత్తం 3199 పోలింగ్ స్టేషన్లు ఉండగా మే 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల నాటికి అదనంగా 29 పోలింగ్ కేంద్రాలతో మొత్తం 3228 చేరుకోనున్నాయి. ఓటు హక్కు ఉన్నవారికి ఇబ్బందులు జరగకుండా ఉండేలా పోలింగ్ కేంద్రాల సంఖ్యను పెంచేలా ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది.

**పెరిగిన పోలింగ్ కేంద్రాల వివరాలు..**

| నియోజకవర్గం | పెరిగిన పోలింగ్ కేంద్రాలు | మొత్తం పోలింగ్ కేంద్రాలు |
|---|---|---|
| మేడ్చల్ | 11 | 591 |
| మల్కాజిగిరి | 07 | 418 |
| కుత్బుల్లాపూర్ | 10 | 592 |
| కూకట్‌పల్లి | 00 | 417 |
| ఉప్పల్ | 00 | 407 |
| ఎల్బీనగర్ | 01 | 571 |
| కంటోన్మెంట్ | 00 | 232 |



# ఎన్నికల సిబ్బందికి సీపీ అవగాహన

సిటీబ్యూరో, మార్చి 21 (నమస్తే తెలంగాణ) : లోక్‌సభ ఎన్నికల సందర్భంగా క్షేత్ర స్థాయిలో తీసుకోవాల్సిన భద్రత ఏర్పాట్లు, కేసుల నమోదు, సెక్షన్ల అమలు, చట్టపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి రాచకొండ సీపీ తరుణ్ జోషి అవగాహన కల్పించారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు పాటించాల్సిన నియమ నిబంధనలు న్యాయ నిపుణులు రాములు సిబ్బందికి వివరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఎఫ్ఐఆర్ నమోదు, విచారణలో ఎలాంటి అలసత్వం, పక్షపాతం వహించకుండా సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. పరిమితికి మించిన అక్రమ నగదును ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ సమక్షంలో సీజ్ చేయాలని సూచించారు. నగదుతో పాటు ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే సామగ్రిని అక్రమంగా తరలిస్తే పట్టుకోవాలని, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రభుత్వ అనుమతి కలిగి ఉన్న ఆయుధాలను స్వాధీనం చేసుకొని ఎన్నికల ప్రక్రియ పూర్తయిన తరువాత తిరిగి అప్పగించాలని సూచించారు. ఈ సమావేశంలో డీసీపీ చంద్రమోహన్, కరుణాకర్, అదనపు డీసీపీలు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ మారినా.. పదవి పాయే!

## మేయర్ పదవి కాపాడుకునేందుకు కాంగ్రెస్‌లో చేరిన మహేందర్ గౌడ్

### ఉత్కంఠ వాతావరణంలో నెగ్గిన అవిశ్వాస తీర్మానం

### బండ్లగూడ జాగీర్ నూతన మేయర్ ఎవరో?

బండ్లగూడ, మార్చి 21 : బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ ఒటెద్దు పోకడ పోతున్నారని పలువురు కార్పొరేటర్లు ఆయనపై గతంలో అవిశ్వాసం పెట్టిన విషయం విదితమే. కోర్టు అదేశాలతో గురువారం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఆర్డీవో వెంకట్‌రెడ్డి అధ్యక్షతన అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు. కార్పొరేషన్ పరిధిలో మొత్తం 22 మంది కార్పొరేటర్లలో ఒకరు మరణించగా 21 మంది కార్పొరేటర్లు ఉన్నారు. 11 గంటలకు ప్రారంభమైన ఈ సమావేశానికి అవిశ్వాసం పెట్టిన 16 మంది కార్పొరేటర్లు తప్ప మేయర్ మహేందర్‌గౌడ్‌తో సహా ఇతర కార్పొరేటర్లు హాజరు కాలేదు. దీంతో అవిశ్వాసాన్ని అంగీకరిస్తూ 16 మంది కార్పొరేటర్లు చేతులెత్తి ఓట్లు వేశారు. కోరం సభ్యుల కంటే ఎక్కువ మంది ఉండటంతో ఆర్డీవో వెంకట్‌రెడ్డి అవిశ్వాసం నెగ్గినట్లు తెలిపారు. రాజేంద్రనగర్ ఏసీపీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ నాగేంద్రబాబు ఆధ్వర్యంలో పోలీసులు సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు.

### పదవి కోసం బీఆర్ఎస్‌ను వీడినా..

కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు సైతం తనపై పెట్టిన అవిశ్వాసంలో ఉన్నారని గ్రహించిన మేయర్ మహేందర్ గౌడ్ తన పదవిని కాపాడుకునేందుకు బీఆర్ఎస్ పార్టీని వీడి అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయినప్పటికీ పదవిని కాపాడుకోలేక పోయారని స్థానికంగా ప్రజలు చర్చించుకుంటున్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా లతాప్రేమ్ గౌడ్‌ను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.




బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ అవిశ్వాసంలో పాల్గొన్న కార్పొరేటర్లను సన్మానించిన స్థానికులు




## టిమ్స్ పనులను వేగవంతం చేయండి

సిటీబ్యూరో, మార్చి 21 (నమస్తే తెలంగాణ) : కొత్తపేటలో నిర్మిస్తున్న టిమ్స్ హాస్పిటల్ నిర్మాణ పనులను గురువారం జిల్లా కలెక్టర్ శశాంక్‌తో కలిసి వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు తనిఖీ చేశారు. కాగా, దవాఖాన నిర్మాణ పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

# దొంగలను దంచికొట్టిన తల్లీకూతురు

### తుపాకీ, కత్తి లాక్కోవడంతో.. పారిపోయిన దుండగులు

### బేగంపేట్ జైన్‌నగర్‌లో కలకలం సృష్టించిన ఘటన

### కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న బేగంపేట్ పోలీసులు

బేగంపేట్, మార్చి 21 : ఇద్దరు అగంతకులు ఓ ఇంట్లో చొరబడి తల్లీకూతురును తుపాకి, కత్తితో బెదిరించి చోరీకి యత్నించిన ఘటన బేగంపేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జైన్ నగర్‌లో కలకలం సృష్టించింది. స్థానికులు, బేగంపేట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బేగంపేట్ జైన్ నగర్‌లో ఉంటున్న అమితామెహాల్ ఇంట్లోకి గురువారం రాత్రి సమయంలో ఒకరు హెల్మెట్, మరొకరు టోపీ, మాస్కు ధరించి కత్తి, తుపాకీతో ఇంట్లోకి చొరబడ్డారు. ఇంట్లో ఉన్న తల్లీకూతురును బెదిరించి దాడి చేసి చోరీకి యత్నించారు. తల్లీకూతురు దుండగులను ఎదిరించి తుపాకీ, కత్తి లాక్కున్నారు. వారితో బీభత్సంగా పోరాడారు. తల్లీకూతురు దాడిని తట్టుకోలేక ఆ ఇద్దరు అగంతకులు అక్కడి నుంచి పారిపోయారు. అయితే పోలీసుల అదుపులో ఓ నిందితుడు ఉన్నట్లు తెలిసింది. నిందితులు తెలిసిన వారేనా..? లేక బయట నుంచి వచ్చిన దొంగలా..? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# గ్రేటర్‌లో సొరంగ మార్గాలు

### డీపీఆర్‌కు ముందుకొచ్చిన 'ఆర్వీ'

### ఐదు చోట్ల సుమారు 39 కి.మీ. నిర్మాణానికి ఈవోఐ పిలిచిన జీహెచ్ఎంసీ

### ఆర్వీ కన్సల్టెన్సీ దరఖాస్తును పరిశీలిస్తున్న అధికారులు



సిటీబ్యూరో, మార్చి 21 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీ పరిధిలోని ఐదు మార్గాల్లో సొరంగ మార్గాల నిర్మాణాలకు సంబంధించిన ఫీజిబిలిటీ స్టడీ, సమగ్ర ప్రాజెక్టు రూపకల్పన (డిటెల్ట్ ప్రాజెక్టు రిపోర్టు) తయారీకి కేవలం ఒకే ఒక సంస్థ ఆసక్తిని చూపింది. గతంలో కేబీఆర్ పార్కు కింద నుంచి సొరంగ మార్గానికి ఫీజిబిలిటీ స్టడీ, డీపీఆర్ తయారీ పనులు పొందిన ఆర్వీ అసోసియేట్స్, అర్కిటెక్ట్ ఇంజినీర్స్ అసోసియేషన్ ముందుకు రాగా.. తాజా టెండర్‌లో ఆర్వీ మాత్రమే ముందుకు వచ్చింది. కాగా గత నెల ఐదు మార్గాల్లో ఈవోఐ టెండర్ పిలిచిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే వచ్చిన ఆర్వీ దరఖాస్తును అధికారులు పరిశీలిస్తున్నారు. ఐతే ఆర్వీ సంస్థకు డీపీఆర్ తయారీ బాధ్యతలు అప్పగిస్తారా? లేదంటే మరోసారి టెండర్ పిలుస్తారా ? అన్నది వేచి చూడాల్సిందే.

**సొరంగ రహదారుల నిర్మాణానికి**

| ఈవోఐ టెండరు పిలిచిన ప్రతిపాదనలు | - దూరం (కిలోమీటర్లు) |
|---|---|
| ఐటీసీ కోహినూర్ నుంచి విప్రో సర్కిల్ వరకు వయా ఖాజాగూడ, నానక్‌రాంగూడ | - 9 కి.మీ |
| ఐటీసీ కోహినూర్ నుంచి జేఎన్‌టీయూ వరకు వయా మైండ్ స్పేస్ జంక్షన్ | - 8.కి.మీ |
| ఐటీసీ కోహినూర్ నుంచి బంజారాహిల్స్ రోడ్ నంబర్ 10 వయా జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 45 | - 7.కి.మీ |
| జీవీకే మాల్ నుంచి నానల్‌నగర్ వయా మాసబ్‌ట్యాంక్ | - 6.కి.మీ. |
| నాంపల్లి నుంచి చాంద్రాయణ గుట్ట ఇన్నర్ రింగు రోడ్డు వయా చార్మినార్, ఫలక్‌నుమా | - 9.కి.మీ |